# పథకాల అమలులో మనమే టాప్



కుభీర్‌లో స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేస్తున్న ముథోల్ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి

కుభీర్, అక్టోబర్ 6 : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రభుత్వ పథకాలు వినియోగించుకోవడంలో మనమే ముందు ఉన్నామని ముథోల్ ఎమ్మెల్యే గడ్డిగారి విఠల్ రెడ్డి పేర్కొన్నారు. కుభీర్‌లోని తహసీల్ కార్యాలయంలో శుక్రవారం 108 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు, 41 జీపీలకు స్పోర్ట్స్‌కిట్లు, 58 జీవో పట్టాలు 24 మందికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి కృషితో ముథోల్ నియోజకవర్గంలో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు పూర్తిగా సద్వినియోగం చేసుకొని ముందు నిలిచామన్నారు. మండలంలోని పలు గిరిజన గ్రామాలు, తండాల్లో ఆలయాల పునరుద్ధరణ, నూతన ఆలయాల నిర్మాణంతో పాటు కల్యాణ మండపాలను కోట్ల రూపాయల ఖర్చుతో నిర్మించుకున్నట్లు తెలిపారు. సీఎంఆర్‌ఎఫ్ ద్వారా కార్పొరేట్ దవాఖానల్లో వైద్యం చేయించుకున్న వేలాది మందికి కోట్ల రూపాయల ఆర్థిక సాయం అందించినట్లు వివరించారు. మిగతా అన్ని పథకాలను ప్రజలు ఎంతో సమన్వయంతో వినియోగించుకుంటున్నారని పేర్కొన్నారు. ఇటీవల నియోజకవర్గంలోని ఆయా గిరిజన గ్రామాలకు రూ. 40 కోట్లు గిరిజన సంక్షేమ శాఖ నుంచి మంజూరైనట్లు వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లోని యువతకు క్రీడాసామగ్రిని అందజేస్తున్నామని తెలిపారు. గతంలో సర్వే నిర్వహించిన జీవో ఎంఎస్ నం.58 కింద కుభీర్‌లోని 24 మందికి పట్టాలు అందజేశామన్నారు. పథకాలను సద్వినియోగం చేసుకొని మళ్లీ కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ పానాజీ మీరా విజయ్ కుమార్, బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ ఎన్నిల అనిల్, జడ్పీటీసీ అల్కతాయి సంజయ్ చౌహాన్, మార్క్‌ఫెడ్ స్టేట్ డైరెక్టర్ రేకుల గంగాచరణ్, పుప్పాల పీరాజీ, సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు దత్తు గౌడ్, మండల కోఆప్షన్ సభ్యుడు దత్త హరి పటేల్, మార్కెట్ కమిటీ చైర్మన్ సంతోష్, మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తహసీల్దార్ సోము, ఎంపీడీవో లింబాద్రి తదితరులు పాల్గొన్నారు.

# మెప్మా ఆర్పీల్లో వేతన సంబురం

- మరోసారి వేతనం పెంచిన రాష్ట్ర ప్రభుత్వం
- రూ.6 వేలు చేస్తూ జీవో విడుదల
- హర్షం వ్యక్తం చేస్తున్న మెప్మా ఆర్పీలు
- 85 మందికి ప్రయోజనం



సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే జోగు రామన్న ఫ్లెక్సీలకు పాలాభిషేకం చేస్తున్న ఆర్పీలు

ఎదులాపురం, అక్టోబర్ 6 : పట్టణ ప్రాంతాల్లో పేదరిక నిర్మూలన కోసం కృషి చేస్తున్న మెప్మా రిసోర్స్ పర్సన్లకు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల గౌరవ వేతనం పెంచడంతో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. 2019 జనవరిలో రూ.4వేలకు పెంచగా తాజాగా మరో రూ.2వేలు పెంచి రూ.6వేలు చేస్తూ జీవో విడుదల చేయడంతో ఆదిలాబాద్ జిల్లాలోని మున్సిపాల్టీలో 85 మందికి ప్రయోజనం చేకూరనుంది. పట్టణాల్లో బ్యాంకు లింకేజీ రుణాలు, స్ట్రీట్ వెండర్స్‌కు రుణాల మంజూరు, బుక్ కీపింగ్ వంటి పనులతో పాటు ప్రభుత్వ కార్యక్రమాల అమలులో కీలకపాత్ర పోషిస్తున్న తమను సీఎం కేసీఆర్ గుర్తించి వేతనాలు పెంచినందుకు జీవితాంతం రుణపడి ఉంటామని కృతజ్ఞతలు తెలుపుతున్నారు. సమైక్య పాలనలో మెప్మా ఆర్పీల గురించి ఎవరూ పట్టించుకోలేదు. ఎన్నో ఏళ్లుగా చాలీచాలని వేతనాలకు పని చేసేవారు. పట్టణంలో పేదరిక నిర్మూలన కోసం కృషి చేస్తున్న వారి సేవలను స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ గుర్తించారు. మహిళా సంఘాల బలోపేతానికి ఆర్పీల పాత్రకీలకం. గౌరవ వేతన పెంపుతో వారు హర్షం వ్యక్తం చేస్తూ సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే జోగు రామన్న చిత్రపటాలకు పాలాభిషేకం చేసి మిఠాయిలు పంపిణీ చేసి కృతజ్ఞతలు చెబుతున్నారు.

### సీఎం కేసీఆర్ సారుకు రుణపడి ఉంటాం



16ఏళ్లుగా మెప్మా ఆర్పీగా పని చేస్తున్న. మెప్మా ఆర్పీల కష్టం గుర్తించిన సీఎం కేసీఆర్ సారు రెండు సార్లు వేతనం పెంచారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ సబ్బండ వర్గాలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నారు. మహిళా సంఘాల అభివృద్ధికి కృషి చేస్తున్నారు. ఆర్పీల కుటుంబాలు రుణపడి ఉంటాం.

**-ఎస్ చెన్నమ్మ, మెప్మా ఆర్పీల సంఘం జిల్లా అధ్యక్షురాలు**

### తెలంగాణ ప్రభుత్వం వచ్చాకే వేతనం పెంపు



2013 సంవత్సరం నుంచి మెప్మా ఆర్పీగా పని చేస్తున్న. అప్పుడు ఎస్‌ఎల్‌ఎఫ్ ద్వారా రూ.2వేలు ఇస్తుండే. అప్పటి నుంచి ఎవరు వేతనాలు పెంచలేదు. కానీ 2019 జనవరిలో రూ.4వేలు వేతనం ఇచ్చిండ్రు. ఇప్పుడు రూ.6వేలు పెంచిన సీఎం కేసీఆర్ సార్‌కు కృతజ్ఞతలు, ఏ ప్రభుత్వాలు మాకు వేతనాలు పెంచలేదు. తెలంగాణ వచ్చాక సీఎం కేసీఆర్ సారు పెంచారు.

**-మంజుషా, మెప్మా ఆర్పీ ,మున్సిపాల్టీ**

# మరోసారి అవకాశమిస్తే మరింత అభివృద్ధి

- సీఎం కేసీఆర్‌తోనే సుపరిపాలన సాధ్యం
- ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న
- అశోక్ బుద్ధ విహార్‌లో రూ.కోటితో ఫంక్షన్ హాల్ నిర్మాణం



జైనథ్: మాట్లాడుతున్న ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న

ఎదులాపురం, అక్టోబర్ 6 : మరోసారి అవకాశమిస్తే మరింత అభివృద్ధి చేస్తానని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్‌లోని అశోక్ బుద్ధ విహార్‌లో రూ.కోటితో చేపడుతున్న అశోక్ ఫంక్షన్ హాల్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ముందుగా ఎమ్మెల్యే జోగు రామన్నకు పుష్ప గుచ్ఛం అందజేసి బ్యాండ్‌మేళాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్‌తోనే సుపరిపాలన సాధ్యమన్నారు. ప్రతి వార్డులో అశోక్ బుద్ధ విహార్లు ఏర్పాటు చేస్తున్నామని, అవసరమైతే అదనంగా నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. ఎన్నికల తర్వాత అర్హులకు ఇంటి స్థలాలు ఇస్తామన్నారు. అలాగే గృహలక్ష్మి పథకం అందరికీ వర్తింపజేస్తామన్నారు. అనంతరం మరాఠీలో అభివృద్ధి, సంక్షేమంపై మాట్లాడారు. కార్యక్రమంలో అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భీంరావ్ వాగ్మారే, దాదాసాహెబ్ జాబడే, బీఆర్‌ఎస్ నాయకులు మెట్టు ప్రహ్లాద్, రాంకుమార్, సాజీదుద్దీన్, పట్టణ మాహిళా విభాగం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు స్వరూపరాణి, మమత, అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఉద్ధవ్ సూర్యవంశీ, కోశాధికారి అంబాజీ పవార్, జిల్లా సంయుక్తకార్యదర్శిగా ఆకాశ్‌దీప్ కాంబ్లే, వివిధ కుల సంఘాల ప్రతినిధులు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

### స్పోర్ట్స్ కిట్లు, చీరలు పంపిణీ

ఆదిలాబాద్ రూరల్, అక్టోబర్ 6: ప్రజా శ్రేయస్సే పరమావధిగా ప్రభుత్వం పాటు పడుతోందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న స్పష్టం చేశారు. మావలలో మహిళలకు బతుకమ్మ చీరెలు పంపిణీ చేశారు. ముందుగా గ్రామానికి వచ్చిన ఆయనకు స్థానికులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగు రామన్న మాట్లాడుతూ ప్రజాహితమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని, అనుక్షణం ప్రజా శ్రేయస్సు కోసం పాటు పడుతోందని అన్నారు. తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టే బతుకమ్మ వేడుకలను ఆడబిడ్డలు సంతోషంగా జరుపుకోవాలనే సద్దుదేశంతో ఎనిమిది సంవత్సరాలుగా చీరలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రమీల, నాయకులు పాల్గొన్నారు.

### గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలి

జైనథ్, అక్టోబర్ 6 : గ్రామీణ యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. జైనథ్‌లో రూ.3 కోట్ల 58 లక్షలతో చేపడుతున్న మినీ స్టేడియం నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం 42 గ్రామాల క్రీడాకారులకు క్రీడా పరికరాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల అధికారి వెంకటేశ్వర్లు, పీఆర్‌ఈఈ మహావీర్, ఎంపీపీ గోవర్ధన్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ, నాయకులు, కార్యకర్తలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# రక్తహీనత రహిత లక్ష్యంగా పని చేయాలి

నిర్మల్ చైన్‌గేట్, అక్టోబర్ 6 : రక్తహీనత రహిత జిల్లాగా మార్చేందుకు కృషి చేయాలని నిర్మల్ జిల్లా వైద్యాధికారి ధన్‌రాజ్ అన్నారు. నిర్మల్‌లోని మంజులాపూర్ గ్రామంలో శుక్రవారం అనిమియాసే నిర్మల్ ముక్త్ కార్యక్రమం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు, గర్భిణులు ఎక్కువగా రక్తహీనతతో బాధపడుతున్నారని దాని మూలంగా నెలలు నిండకుండానే పిల్లలకు జన్మనిస్తున్నారన్నారు. నిత్యం తీసుకునే పోషకాహారంలో ఆకు కూరలు, బెల్లం, పల్లీలు, క్యారెట్, బీట్‌రూట్, తృణధాన్యాలు ఉండే విదంగా చూసుకోవాలన్నారు. రక్తహీనతను అధిగమించేందుకు తీసుకోవాల్సిన అంశాలపై వివరించారు. పండ్లు, కూరగాయల ప్రదర్శన నిర్వహించారు. సమావేశంలో డాక్టర్ సౌమ్య, హెచ్‌ఈవో దాజీబా, పీహెచ్‌ఎన్‌లు దుర్గాభవాని, మాధురి, కిశోర బాలికలు, తదితరులు పాల్గొన్నారు.

# చేప పిల్లల ఉత్పత్తులపై అవగాహన కల్పించాలి



కొండాపూర్‌లో వ్యవసాయ ఉత్పత్తుల ఫారంను సందర్శిస్తున్న నిర్మల్ కలెక్టర్ వరుణ్‌రెడ్డి

సోన్, అక్టోబర్ 6 : నిర్మల్ జిల్లాలో వ్యవసాయానికి అనుబంధంగా ఇతర వృత్తుల ప్రోత్సాహానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఇందులో చేప పిల్లల పెంపకం ఎంతో లాభదాయకమని కలెక్టర్ వరుణ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నిర్మల్ మండలంలోని కొండాపూర్ గ్రామంలో ఈజీఎస్ ద్వారా చేపడుతున్న సమీకృత వ్యవసాయ ఉత్పత్తుల ఫారంలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయాన్ని నమ్ముకున్న రైతులకు ఇతర ఉత్పత్తులపై ప్రోత్సాహం అందిస్తే లాభసాటిగా ఉంటుందన్నారు. ప్రభుత్వం చేప పిల్లల ఉత్పత్తులకు ఈజీఎస్‌లో రాయితీని అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్డీవో విజయలక్ష్మి, సర్పంచ్ గంగాధర్, ఎంపీడీవో సాయిరాం, ఏపీవో తుల రామకృష్ణ, ఏపీఎం గంగన్న, సీసీలు రేఖ పాల్గొన్నారు.



చెక్‌పోస్ట్‌ను తనిఖీ చేస్తున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్ రాజ్

# చెక్‌పోస్ట్ తనిఖీ

తలమడుగు, అక్టోబర్ 6 : ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఆదిలాబాద్ జిల్లాలోని అంతర్రాష్ట్ర సరిహద్దులైన తలమడుగు మండలం లక్ష్మీపూర్ చెక్‌పోస్ట్‌ను శుక్రవారం కలెక్టర్ రాహుల్ రాజ్ తనిఖీ చేశారు. అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. చెక్‌పోస్ట్‌ల వద్ద పకడ్బందీగా తనిఖీలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని, రానున్న ఎన్నికల దృశ్య డబ్బు, మద్యం, మత్తు పదార్థాలు వంటి రవాణాను అరికట్టేలా పర్యవేక్షించాలని సూచించారు. సరిహద్దుల్లో పూర్తిస్థాయి సిబ్బందిని నియమించడంతో పాటు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షణ చేపట్టనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ రాజ్ మోహన్, ఆబ్కారీ, పోలీస్ సిబ్బంది ఉన్నారు.